# ప్రేమ ఎంత మధురం!

పెద్దూరి వెంకటదాసు

"మామయ్యా! అక్క, బావ, మిమ్మల్ని, అత్తయ్యను అమెరికా రమ్మన్నారట. రామచంద్రరావని బావ ఫ్రెండ్ మరో వారం రోజుల్లో అమెరికా వెళ్తున్నాట ఏర్పాట్లన్నీ దగ్గరుండి చూసి మరీ రమ్మన్నారట మిమ్మల్ని తనతో పాటు" చెప్పాడు వేణు. సాయంత్రం మామయ్య పొలం నుంచి రాగానే-

చాలా కాలం తర్వాత చూడడం మూలాన ఓ పట్టాన పోల్చుకోలేక పోయాడు. అయినా ఆ ముఖకవళికలు, మాట్లాడే తీరును బట్టి అర్థమైంది కాసేపటికి, అతనెవరో వెంకటాచలానికి.

"అదేమిట్రా, మీ అమ్మానాన్నలు గదా వెళ్దామనుకుంది, మమ్మల్ని రమ్మనమన డమేమిటి?" ఎందుకీ మార్పు జరిగిందో అర్థం కాలేదు వెంకటాచలానికి.

"అర్జంటుగా మీకీ విషయం చెప్పి రాత్రి బస్సుకే నన్ను హైదరాబాద్ రమ్మన్నారు నాన్నగారు. మీరు వెళ్లే ఏర్పాట్లు చూట్టానికి రేపు నను వెళ్లి రామచంద్రరావ్ గారిని కలవాలట! మధ్యాహ్నమనగా వచ్చాను, పొలం వెళ్లి మామయ్యను కలిసి వెళతానంటే అత్తయ్య వింటేగా, 'భోంచేసి కాసేపు రెస్టు తీసుకో. ఆయన సాయంత్రం వస్తా'డంటూ ఇప్పటి దాకా నన్నాపింది." అత్తయ్య చెప్పాల్సింది టకటకా చెప్పేసి, "అదిగో ఆటో వెళ్తున్నట్టుంది. మెయిన్ రోడ్డు వరకు నే వస్తా" అంటూ వెళ్లి పోయాడు వేణు.

"ఈ ఒక్క పూట ఉండి ఉదయాన్నే వెళ్లరా" అని మామయ్య చెప్పినా ఆగకుండా-

ఆ రాత్రికి భోంచేసి పెరట్లో నులక మంచం పై మేను వాల్చాడన్నమాటే గాని, వెంకటాచలం మనసులో ఎన్నో ఆలోచన లు సుళ్లు తిరిగాయి.

000

వెంకటాచలం పెద్దగా చదువుకోక పోయినా, కొడుకుని మాత్రం ఇంజినీర్ని చేశాడు. మొదటి నుంచి చదువులో చురుకుగా ఉన్న కొడుకుని ఎలాగైనా ఉన్నత చదువులు చదివించాలనుకున్నా రు, ఉద్యోగం కూడా సంపాదించుకున్నా రు.

"నీ కొడుకును చదివించి మన ఊరి నుంచి కూడా ఒకరు అమెరికాలో ఉన్నారని గర్వంగా చెప్పుకునేలా చేశావయ్యా!" అంటూ ఆ ఊరి జనం పొగిడినా, "వాడు శ్రద్ధగా చదవడం వల్లే తప్ప నా గొప్పేం లేదందులో" అని కొడుకును గురించి గొప్పగా చెప్పుకునే వెంకటాచలానికి, అనుకోకుండా ఓ ఎదురు దెబ్బ తగిలింది.

కొడుకు దగ్గరి నుంచి వచ్చిన లెటరు. అతని ఊహల్ని తారుమారు చేసింది. అతని అంచనాని ఎగతాళి చేసింది.

ఊరి జనం ముందు పలచనవడం ఇష్టం లేక ఆ బాధని తనలోనే దిగమ్రింగుకు న్నాడు. క్రమేణా తన మనస్సును కుదుట పరుచుకున్నాడు.

మళ్లీ, ఇన్నాళ్లకు-మేనల్లుడు వేణు స్వయంగా వచ్చి 'మీకు అమెరికా నుంచి పిలుపొచ్చిం'దని చెప్పడం-ఏది ఏమైనా, కొడుకును ఎప్పుడెప్పుడు చూడాలా అని ఆరాటపడుతున్న భార్య కామాక్షి కోసం- "మనకు చెప్పకున్నా మంచి పనే చేశాడు కదా!" అని అదృష్టయిన భార్యలాగా తను సరిపెట్టుకోలేకపోయాడు.

అయినా, కామాక్షి మొహంలోని ఆనందాన్ని చెరిపెయ్యకూడదనుకుంటే అమెరికా వెళ్లాలి. అదే నిర్ణయించు కున్నాడు.

000

'లాస్ వెగాస్' అన్నౌన్స్‌మెంట్-

"మనం మీ కొడుకున్న సిటీకి వచ్చేశాం" చెప్పాడు రామచంద్రరావ్.

ఆంధ్రప్రదేశ్ మారుమూల పల్లె నుంచి అమెరికాలో అత్యంతధనవంతులుండే ఆ సిటీలో పాదం మోపగానే, స్వప్నలోకంలో ఉన్నట్టనిపించింది వారికి. హైదరాబాద్ నుంచి అమెరికాకు ఫ్లయిట్లో ప్రయాణం మిగిల్చిన అనుభూతి చెరిగిపోక ముందే మరొక కనువిందు, ఈ రంగురంగుల ప్రపంచం వారికి-

ఎవరో అమ్మాయి వచ్చి ఆత్మీయంగా స్పృశించి వాళ్లని కదిలించేవరకు బిక్క మొహం వేసుకుని చూస్తుండిపోయారు బొమ్మల్లాగే.

"అత్తయ్యా, మావయ్యా ప్రయాణం కులాసాగా సాగిందా?"

ఆ తెలుగు పిలుపు వాళ్ల చెవులని తాకి తన్మయుల్ని చేసింది. తలెత్తి చూశారు. అందాల కుందనపు బొమ్మ తమ ముందు హైదరాబాద్‌లో బయలు దేరింది మొదలు తెలుగు పలుకే దూరమైంది వాళ్లకి. అప్పుడప్పుడు రామచంద్రరావే వాళ క్కెలాంటి ప్రాబ్లమ్ లేకుండా పలకరించి అవసరాలు తీర్చాడు తప్ప- అలాంటిది ఇన్ని గంటల తర్వాత చల్లని తెలుగు పిలుపు విందు భోజనం తిన్నట్టనిపించిది వారికి.



"మీ అబ్బాయి అర్జంటు ఆఫీసు పని ఉన్నందువల్ల రాలేకపోయారు నన్ను ఎయిర్ పోర్ట్‌కెళ్లి మిమ్మల్ని తీసుకురమ్మన్నారు" చెప్పిందా అమ్మాయి వినమ్రంగా.

వాళ్లకర్థమైంది ఆ అమ్మాయి ఎవరో. అర్థం కానిదల్లా ఆత్మీయంగా వాళ్ల కాళ్లను తాకి వాళ్ళ మనసు చలించేలా అందరి ముందు నమస్కరించేంతటి సంస్కృతి ఆ అమెరికా అమ్మాయికి ఎలా అబ్బిందా? అని అలాగే కోడలి వైపు చూస్తుండి పోయింది కన్నార్పకుండా కామాక్షమ్మ.

కోడలు కలుపుగోలుతనానికి మంత్రముగ్ధులైన వాళ్లకి-రాత్రి కొడుకొచ్చే వరకు సమయమే తెలియలేదు.

కుశలప్రశ్నల తర్వాత తల్లితండ్రుల మూడ్ చూసి, సంజాయిషీ యిచ్చుకున్నాడు శ్రీధర్.

చెప్పకుండా పెళ్లి చేసుకున్నందుకు మనస్సులో గిల్టీ కాన్షియస్. తప్పు చేసినందుకు,

చిత్రంగా ఆ విషయమే పట్టించుకోకుండా క్యాజువల్‌గా తల్లితండ్రులు రిసీవ్ చేసుకునేసరికి-ఆశ్చర్యపోవటం శ్రీధర్ వంతైంది. ఏది ఏమైనా హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు.

అతనికి తెలియదు అప్పటికే భార్య జరిగిన సంఘటనలన్నీ పూస గుచ్చినట్లు అత్తమామలకు వివరించిందని.

కోడల్ని కలవక ముందు వారి ఆలోచనలు వేరు. వచ్చిన కాపేపట్లోనే తన ఆప్యాయతతో తమ మనసుల్ని దోచేసింది. ఇక వాడి నాకర్షించడంలో వింతేముంది అనుకున్నారేమో! అమ్మాయి సెలక్షన్ విషయంలో అతను ముమ్మాటికి తప్పు చేయలేదని నిర్ధారణకు వచ్చారు- అనేకంటే మంచి పని చేశాడని మురిసిపోయారంటే సబబుగా ఉంటుందేమో!


మనిషి అందమే కాదు, ఆమె మనస్సూ అందమే. అవకాశమున్నప్పుడల్లా సెలవు పెట్టి అత్తమామలను బయటకు తీసుకెళ్లేది. ఒకసారి తెలుగు అసోసియేషన్‌కి తీసుకెళ్లి అక్కడున్న తెలుగు వాళ్ళందరికి పరిచయం చేసింది అత్తమామల్ని-కొందరు వాళ్ళ ఇళ్లకి ఆహ్వానించారు కూడా. తనే కూడా ఉండి తీసుకెళ్లింది వాళ్ల ఇళ్లకు, రోజు ఎవరో ఒకళ్లు వచ్చి పలకరించడం అందరితో కోడలు కలుపుగోలుగా ఉండటం అది కలా! నిజమా! తాము అమెరికాలో ఉన్నామా! ఆంధ్రప్రదేశ్‌లోనా! అన్నట్లుంది వాళ్లకి, అందరూ ఆప్యాయంగా ఆదరిస్తుంటే, రోజుకో స్థలం చొప్పున అప్పటికే చూడాల్సిన స్థలాలన్నీ చూపించింది కోడలు, ఒక్క నయాగరా జలపాతం తప్ప.

అత్తమామలు ఇండియా బయలుదేరే రోజు కూడా దగ్గర పడుతుంది. గెట్ టుగెదర్ లాగా సెలబ్రేట్ చేసుకుందామని కొందరి ఫ్రెండ్స్‌ని కూడా ఆహ్వానించింది తమతో రమ్మని-

అందుకే భర్త కూడా వాళ్ల అమ్మా నాన్నలతో ఒక్క రోజు సెలవు పెట్టి గడపాలని అడిగింది.

"శ్రీ. విల్ యూ ప్లీజ్ స్పెండ్ వన్ డే విత్ హజ్ విల్ గోటు నయాగరా-"

"నో ఐ కాన్ట్ డోన్ట్ వేస్ట్ మై టైమ్!" చిరాగ్గా జవాబిచ్చాడు భర్త-



"ప్లీజ్" మళ్లీ రిక్వెస్ట్ చేసింది భర్తని-

"ఈజ్ ఇట్ నెసెసరీ? వాట్ ఐ సజెస్ట్ ఈజ్ డోన్ట్ వేస్ట్ యువర్ లీవ్స్ అన్ నెసెసరిలీ - అండ్ డోంట్ ఇర్రిటేట్ మి."

అంతే, ఆమె గిరుక్కున వెనక్కు మళ్లింది "శైలూ!" పిలిచాడతను.

పట్టించుకోలేదామె. విసురుగా వెళ్లిపోయాడు ఆఫీసుకు శ్రీధర్.

తిరిగి ఆమె తన పనిలో నిమగ్నమైంది. తొందరగా తెముల్చుకొని నయాగరా వెళ్దామని-

మెల్లిగా కోడల్ని కదిపాడు మామ. "ఏమ్మా! అబ్బాయి కోపంగా వెళ్లిపోయాడు, ఏం జరిగింది?" అన్నాడు కోడలి మొహంలోని భావాలను చదవడానికి ప్రయత్నిస్తూ-

"ఏం ! లేదు మావయ్యా గారు, ఒంట్లో బాగా లేదట వారికి. నేనేమో ఆఫీసుకి సెలవు పెట్టి రెస్టు తీసుకొమ్మన్నాను, ఆయన బిజీ మనిషి కదా! రెస్ట్ అనే పదం నచ్చదు-అందుకే కోపం. నన్ను మాత్రం ఆఫీసుకి సెలవు పెట్టి మిమ్మల్ని నయాగరా తీసుకెళ్ళమన్నాడు-తొందరగా తయారవ్వండి. బయలుదేరదాము వంట కూడా పూర్తి కావచ్చింది."

అంత పనిలోను మామయ్య అలాగే చాలా సేపటి నుంచి నిలబడి ఉండడం గమనించి కుర్చీ తెచ్చి వేసింది, 'కూర్చోండి' అంటూ.

"ఆ ఏం ! కూర్చోవటంలే అమ్మా! అబద్ధాలు కూడా నీ గొంతులో ఇంద అందంగా పలుకుతాయా తల్లీ?"

ఉలిక్కిపడింది శైలజ మావయ్య మాటలకి. కామాక్షమ్మకి అర్థం కాలేదు మొగుడేం మాట్లాడుతున్నాడో.

"సెలవు పెట్టి మరీ తీసుకెళ్లి చూపించమన్నాడా?"

మావయ్యా అన్న మాటలకి అర్థం ఆమెకు బోధపడలేదు.

"వాట్ ఐ సజెస్ట్ ఈజ్ బెటర్ డోంట్ వేస్ట్ యువర్ లీవ్స్' అంటె అమెరికాలో అర్థం మారుతుందా తల్లీ?"

"మావయ్యా మీరు ఇంగ్లీషు..." నివ్వెరపోయింది శైలజ.

"యస్. ఎందుకమ్మా నిజం దాస్తావు- కాస్తో కూస్తో కనీసం వాడి పిల్లలతో మాట్లాడాలన్నా నాలుగు ఇంగ్లీషు ముక్కలు రావాలని, కష్టపడి మా ఊరి పంతులు దగ్గర నేర్చుకున్నాను. మీ అత్తయ్య రోజు ఏంటయ్యా! ఆలస్యంగా వస్తున్నావు రాత్రులు అంటె పంతులు గారితో పిచ్చాపాటి కబుర్లు తప్ప ఏముంటాయే అంటూ. చూడమ్మా! మీరు మాట్లాడుకున్నది విన్నది తప్పయినా, నిజాలు నా చెవిన పడకుండా పోవు కదా! ఇలా ప్రతి సారీ నువ్వు చూడాల్సిన ప్రదేశాలంటూ నువ్వు నీ లీవ్స్ ఖర్చు పెట్టుకుంటే ఆ తర్వాత మీకు అవసరానికి కష్టమని అబ్బాయి చెప్పాడు. అందులో తప్పేం లేదు. ప్రతిసారీ మీరీ విషయంలో గొడవ పడటం నాకు బాధ కలిగించేది తల్లీ. మేము ఇప్పటికే చాలా చూశాము. చాలా ఆనందించాము. ఇక ఏం మిగిలిందమ్మా చూట్టానికి. నయాగరా జలపాతం నీ కన్నా, నీ మనసు కన్నా అందంగా ఉంటుందా? ఈ జన్మకిది చాలు. మళ్లీ జన్మంటూ ఉంటే వచ్చి నీ కడుపున పుట్టాలని కోరుకుంటునమ్మా!"

మొదటి సారి వెంకటాచలం కళ్ల వెంట నీరు చూసి, చలించి పోయింది కామాక్షమ్మ.

(ఇంకా వుంది)